


## టాటా మోటర్స్ అల్ట్రోజ్ రేసర్

ముంబై, జూన్ 7: ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ విభాగాన్ని మరింత బలోపేతం దిశగా అడుగులు వేస్తున్న దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్.. మార్కెట్లోకి నయా మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అల్ట్రోజ్ రేసర్ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ మూడు రకాల్లో లభించనున్నది. 1.2 టర్బో పెట్రోల్ ఇంజిన్, 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో రూపొందించిన ఈ మాడల్‌లో 26 సెంటీమీటర్ల టచ్‌స్క్రీన్, వెంటిలేటెడ్ సీట్లు, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు ఉన్నాయి. ఈ కారు పెట్రోల్ మాన్యువల్, పెట్రోల్ డీసీఏ, డీజిల్, సీఎన్‌జీల్లో లభించనున్నది. వీటిలో ఆర్1 మాడల్ ధర రూ.9.49 లక్షలు, ఆర్ 2 ధర రూ.10.49 లక్షలు, ఆర్3 ధర రూ.10.99 లక్షలుగా నిర్ణయించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా అల్ట్రోజ్‌కు 2.5 లక్షల కస్టమర్లు ఉన్నారు.

# బల్క్ డిపాజిట్ పరిమితి 3 కోట్లు

### 8వ 'సారీ' కీలక వడ్డీరేట్లు యథాతథం
### ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో నిర్ణయం
### యూపీఐ లైట్ సేవలు విస్తృతం
### వృద్ధిరేటు అంచనా 7.2 శాతానికి పెంపు

ముంబై, జూన్ 7: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్లకున్న పరిమితిని రూ.3 కోట్లకు పెంచింది. శుక్రవారం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇక్కడ వెల్లడించారు. ఈ క్రమంలోనే ఇప్పటిదాకా రూ.2 కోట్లుగానే ఉన్న బల్క్ ఎఫ్‌డీల పరిమితిని రూ.3 కోట్లకు పెంచినట్టు చెప్పారు. ఈ నిర్ణయం బ్యాంకుల అసెట్ లయబిలిటీ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపర్చగలదన్నారు. కాగా, రిటైల్ టర్మ్ డిపాజిట్ల కంటే ఈ బల్క్ ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు కాస్త ఎక్కువగా ఉంటాయి. ఆయా బ్యాంకులు ఈ డిపాజిట్లపై వివిధ రకాల వడ్డీరేట్లను ఆఫర్ చేస్తుంటాయి. దీంతో డిపాజిట్‌దారులకు తాజా నిర్ణయం కలిసి రానున్నది. ఇదిలావుంటే ఇకపై షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా), స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లోని రూ.2 కోట్లదాకా ఉన్న సింగిల్ రుపీ టర్మ్ డిపాజిట్లు కూడా రిటైల్ ఎఫ్‌డీల్లో భాగమేనని దాస్ వెల్లడించారు.

**6.5 శాతం వద్దే రెపో**

కీలక వడ్డీరేట్లను ఊహించినట్టుగానే వరుసగా ఎనిమిదోసారీ ఆర్బీఐ యథాతథంగానే ఉంచింది. రెపో రేటును 6.50 శాతం వద్దే ఉంచినట్టు గవర్నర్ దాస్ పేర్కొన్నారు. ఆరుగురు సభ్యులున్న మానిటరీ పాలసీ కమిటీలో మెజారిటీ సభ్యులు వడ్డీరేట్లను ఈసారి కూడా ఎక్కడివక్కడే ఉంచాలన్నారు. అయితే గతంతో పోల్చితే మాత్రం వడ్డీరేట్లను తగ్గించాలన్నవారి సంఖ్య పెరిగింది. పోయినసారి సమీక్షలో ఒక్కరే వడ్డీరేట్లను తగ్గించాలనగా, ఈసారి ఇద్దరన్నారు. గోయల్, వర్మ వారిలో ఉన్నారు. గవర్నర్ దాస్‌తోపాటు శశాంక, రాజీవ్, మైఖెల్ వడ్డీరేట్లను అలాగే ఉంచాలన్నారు. దేశ వృద్ధిరేటు బాగుండటంతో వడ్డీరేట్లను ఇకనైనా తగ్గించాలన్న అభిప్రాయాలొస్తున్నాయి. నిరుడు ఫిబ్రవరిలో రెపోరేటును 6.50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.



ద్వైమాసిక ద్రవ్యసమీక్ష సందర్భంగా శుక్రవారం ముంబైలో విలేకరుల సమావేశానికి వెళ్లేముందు డిప్యూటీ గవర్నర్లతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

### ఈసారి జీడీపీ 7.2%!

ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను దేశ జీడీపీ అంచనాను తాజా ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ 7.2 శాతానికి పెంచింది. ఇంతకుముందు ఇది 7 శాతంగానే ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో పుంజుకున్న డిమాండ్, మెరుగైన వ్యక్తిగత వ్యయ సామర్థ్యం దృష్ట్యానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేసింది. త్రైమాసికాలవారీగా ఏప్రిల్-జూన్‌లో 7.3 శాతం, జూలై-సెప్టెంబర్‌లో 7.2 శాతం, అక్టోబర్-డిసెంబర్‌లో 7.3 శాతం, జనవరి-మార్చిలో 7.2 శాతంగా వృద్ధిరేటు నమోదు కాగలదని ఈ సందర్భంగా ఆర్బీఐ తెలిపింది. కాగా, సేవా రంగం ఉత్సాహకరంగా ఉన్నదని, వ్యవసాయ రంగం కూడా ఆశాజనకంగానే కనిపిస్తున్నదని, అందుకే గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతున్నదని పేర్కొన్నది. ఈసారి సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదు కాగలదన్న వాతావరణ శాఖ అంచనాల మధ్య ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల దిగుబడులు పెరుగవచ్చన్న ఆశాభావాన్ని ఆర్బీఐ వ్యక్తం చేసింది.

### యూపీఐ లైట్‌లో ఆటో లోడ్

చిన్న మొత్తాల్లో జరిగే డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకున్నది. వినియోగదారులు తమ యూపీఐ లైట్ వ్యాలెట్లలో ఆటోమేటిగ్గా నగదును నింపుకొనేందుకు అనుమతినిచ్చింది. ఈ క్రమంలోనే ఈ-మ్యాండేట్ ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి యూపీఐ లైట్‌ను తీసుకొచ్చింది. యూపీఐ సరళతర వెర్షనే ఈ యూపీఐ లైట్. దీని ద్వారా చేసే చెల్లింపులకు ఎలాంటి పిన్ అవసరం లేదు. ఇందులో ఒకసారి రూ.2,000 వరకే లోడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం యూపీఐ లైట్ లావాదేవీలకు రోజువారీ పరిమితి రూ.2,000. అలాగే ఒకసారి చేసే గరిష్ఠ చెల్లింపు రూ.500. ఈ నేపథ్యంలోనే ఈ వ్యాలెట్‌లో నిర్ణీత నగదు మొత్తాలు తగ్గితే దానంతటదే దీనికి లింకైన మెయిన్ బ్యాంక్ అకౌంట్ నుంచి ఆ మేరకు నగదును మళ్లీ తీసుకునేలా ఆర్బీఐ అనుమతులిచ్చింది. ఇక ఫాస్టాగ్, ఎన్‌సీఎంసీ తదితర రికరింగ్ పేమెంట్ లావాదేవీలకూ ఇదే పద్ధతిని ఆర్బీఐ ప్రతిపాదించింది. ట్రావెల్/మొబిలిటీ సంబంధిత చెల్లింపులకు తమ ఈ నిర్ణయం మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ఆర్బీఐ అభిప్రాయపడింది.

### 'ద్రవ్యోల్బణం 4 శాతానికి దిగొస్తేనే వడ్డీరేట్ల కోతలుంటాయ్'

*ప్రధాన ద్రవ్యోల్బణం 4 శాతం లేదా అంతకంటే కిందికి దిగొస్తేనే వడ్డీరేట్లను తగ్గించేందుకు వీలుంటుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనే సెంట్రల్ బ్యాంక్ నిర్ణయాలు ద్రవ్యోల్బణ లక్ష్యాలకు లోబడే కొనసాగుతాయని మరోమారు ఆయన స్పష్టం చేశారు. ఆర్బీఐ ద్రవ్యసమీక్ష అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణం తగ్గుతున్నట్టే తగ్గి మళ్లీ పెరుగుతుండటం ఒకింత ఆందోళనకరమేనన్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించినా.. ఇక్కడ ద్రవ్యోల్బణం అదుపులోకి రాకపోతే వడ్డీరేట్ల కోతలకు ఆస్కారం ఉండకపోవచ్చన్నారు. కాగా, ఆన్‌లైన్ పేమెంట్ లావాదేవీల్లో అవాంతరాలు.. బ్యాంకింగ్ వ్యవస్థలోని సమస్యల వల్లేనని, అంతేగానీ యూపీఐ లేదా ఎన్‌పీసీఐ వల్ల కాదని గవర్నర్ దాస్ ఈ సందర్భంగా చెప్పారు. ఇక దేశంలో బంగారం నిల్వలు పెరుగుతున్నా.. ఇంకా పుత్తడి నిల్వకు కావాల్సినంత చోటుందని, అందుకే ఇంగ్లండ్‌లో పెట్టిన 100 మెట్రిక్ టన్నుల పసిడిని ఇటీవల భారత్‌కు తీసుకొచ్చామని దాస్ తెలిపారు. అంతే తప్ప దీని వెనుక మరో కారణమేమీ లేదని తెలియజేశారు.*

### సమీక్ష ముఖ్యాంశాలు

- **ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ద్రవ్యోల్బణం అంచనా 4.5% వద్ద యథాతథం.**
- **ఈ ఆర్థిక సంవత్సరానికిగాను కరెంట్ ఖాతా లోటు ఆమోదయోగ్య స్థాయిలోనే ఉండొచ్చన్న అంచనాలు.**
- **దేశంలోని ఫారెక్స్ నిల్వలు రికార్డు స్థాయికి. మే 31 నాటికి 651.5 బిలియన్ డాలర్లుగా నమోదు. ఒక్కవారంలో 4.84 బిలియన్ డాలర్లు పెరిగాయి.**
- **హేతుబద్ధీకరణ దిశగా ఫెమా కిందనున్న ఎగుమతి-దిగుమతి నిబంధనలు.**
- **పేమెంట్ మోసాలను ఎదుర్కొనేందుకు ఓ డిజిటల్ పేమెంట్స్ ఇంటెలిజెన్స్ వేదిక.**
- **తదుపరి ద్రవ్యసమీక్ష ఆగస్టు 6-8.**

ఈ ఆర్థిక సంవత్సరానికిగాను దేశ వృద్ధిరేటు అంచనాను ఆర్బీఐ పెంచడం నిజంగా ప్రోత్సాహకరమే. వడ్డీరేట్లు తగ్గితే అన్ని రంగాలకు మరింత ఊతమిచ్చినట్టవుతుంది. ముమ్ముందు తగ్గుతాయని ఆశిస్తున్నాం.

***-ఫిక్కీ, అసోచామ్, పిహెచ్‌డీసీసీఐ***

ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నది. అందుకే తదుపరి ద్రవ్యసమీక్షలోనైనా రెపో రేటును ఆర్బీఐ తగ్గించాలి. అప్పుడే గృహ రుణాలపై వడ్డీరేట్ల భారం దిగుతుంది.

***-క్రెడాయ్, నరెడ్కో***

ద్రవ్యసమీక్ష ఊహించినట్టుగానే సాగింది. నిజానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం (అక్టోబర్-మార్చి)లోనే వడ్డీరేట్ల తగ్గింపునకు అవకాశాలున్నాయి.

***-బ్యాంకర్లు, ఆర్థికవేత్తలు, నిపుణులు***

## అదరగొడుతున్న మార్కెట్లు

### సెన్సెక్స్ 1,618, నిఫ్టీ 468 పాయింట్లు వృద్ధి



ముంబై, జూన్ 7: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయికి ఎగబాకాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ అంచనాను 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంచుతూ రిజర్వుబ్యాంక్ ప్రకటించడంతో మదుపరులకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఇప్పటికే మోదీ సర్కార్ మూడోసారి అధికారం చేపట్టబోతుండటంతో దూసుకుపోతున్న సూచీలకు ఈ శుభవార్త మరింత కిక్కునిచ్చింది. ఇంట్రాడేలో 1,720 పాయింట్లు (2.29 శాతం) పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ నూతన శిఖరానికి 76,795. 31 స్థాయికి చేరుకున్నది. చివర్లో మార్కెట్ ముగిసే సమయానికి కూడా ఆల్‌టైం హైకి 76,693.36 వద్ద ముగిసింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే 1,618.85 పాయింట్లు ఎగబాకింది. ఐటీ రంగ షేర్లతోపాటు ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లలో ర్యాలీ జరిగింది. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయంతో ఇందుకు సంబంధించిన రంగాల్లో షేర్లలో భారీ ర్యాలీ జరిగింది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ సూచీలు ఐదు శాతం వరకు లాభపడ్డాయి.

**మూడు రోజుల్లో 28 లక్షల కోట్లు**

వరుస లాభాలతో మదుపరులు తడిసిముద్దవుతున్నారు. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 4,614 పాయింట్లు లేదా 6.40 శాతం పెరగడంతో మదుపరుల సంపద రూ.28.65 లక్షల కోట్ల మేర పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.28,65,742.36 కోట్లు పెరిగి రూ.4,23,49,447.63 కోట్ల(5.08 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది.

**మెరిసిన హెరిటేజ్ షేరు**

తెలుగు దేశం పార్టీకి సంబంధించిన కంపెనీల షేర్లు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా గత ఐదు రోజుల్లో హెరిటేజ్ షేరు 55 శాతం పుంజుకుంది. దీంతో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు భార్య నారా భువనేశ్వరి సంపద రూ.584 కోట్లు పెరిగింది. మే 31న రూ.402.90 వద్ద ఉన్న హెరిటేజ్ షేరు ధర శుక్రవారం మరో 10 శాతం పెరిగి రూ.661.25 వద్దకు చేరుకున్నది. దీంతో కంపెనీలో 24.37 శాతం వాటా కలిగివున్న భువనేశ్వరి, 10.82 శాతం వాటా ఉన్న బ్రాహ్మణి నికర విలువ మరో రూ.870 కోట్లు పెరిగి రూ. 2,190 కోట్లకు చేరింది.

## గ్లాండ్‌ఫార్మా చైర్మన్‌గా శ్రీనివాస్ సాదు

న్యూఢిల్లీ, జూన్ 7: గ్లాండ్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ సాదుకు పదొన్నతి లభించింది. ఆయన ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవోగా నియమితులయ్యారు. ఈ నెల 10 నుంచి ఈ నియామకం అమల్లోకి రానున్నది. ఏప్రిల్ 25, 2019 నుంచి కంపెనీ ఎండీ, సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.

## టీ హబ్‌లో ఫాల్కన్ ఎక్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): టీహబ్‌లో యాక్సిలరేటర్ కేంద్రాన్ని ప్రారంభించింది అమెరికాకు చెందిన ఫాల్కన్ ఎక్స్ సంస్థ. యాక్సిలరేటర్ మెంబర్‌షిప్ ప్లాన్ పేరుతో స్టార్టప్‌లు అమెరికాలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు అవకాశాలు కూడా లభించనున్నాయి. వివరాలకు ఈ లింకులో(oday: https://bit.ly/3RKtzpe) సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు



న్యూఢిల్లీ, జూన్ 7: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకున్నది. ఎంపిక చేసిన రుణాలపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) రేట్లను ఐదు బేసిస్ పాయింట్లు తగ్గించింది. రెండేండ్ల కాల పరిమితి కలిగిన రుణాలపై విధించే ఎంసీఎల్ఆర్‌ని 9.35 శాతం నుంచి 9.30 శాతానికి దిగొచ్చింది. మిగతా రేట్లు మాత్రం యథాతథంగా ఉంచింది. ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై రేటు 8.95 శాతంగాను, నెల రుణాలపై 9 శాతం, మూడు నెలల రుణాలపై 9.15 శాతం, ఆరు నెలల రుణాలపై 9.30 శాతం, ఏడాది, రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై వడ్డీరేటు 9.30 శాతంగా ఉంచింది.

## రెడ్డీస్‌కు ఎఫ్‌డీఏ అబ్జర్వేషన్లు

హైదరాబాద్, జూన్ 7: డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్‌కు చెందిన ఏపీలోని శ్రీకాకుళంలోగల ఏపీఐ తయారీ కేంద్రానికి యూఎస్‌ఎఫ్‌డీఏ నాలుగు అబ్జర్వేషన్లతో ఫామ్ 483ని జారీ చేసింది. ఏపీఐ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం ఇది వచ్చినట్టు తెలిపింది. మే 30 నుంచి జూన్ 7 వరకు ప్లాంట్‌లో తనిఖీలు జరిగాయన్న రెడ్డీస్.. యూఎస్‌ఎఫ్‌డీఏ చేసిన సూచనలకు నిర్ణీత సమయంలోనే సమాధానమిస్తామన్నది.

